# గులాబీ దండు తరలిరావాలి

వాల్ రైటింగ్ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపు



జై కేసీఆర్ అంటూ మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా' వాల్ రైటింగ్

అశ్వారావుపేట, ఏప్రిల్ 16: హనుమకొండ జిల్లాలో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ దండు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని షిర్డీ సాయి నగర్‌లో బుధవారం వాల్ రైటింగ్‌తో ప్రచారం ముమ్మరం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలన స్వర్ణయుగంలా నడిచిందని, అన్ని వర్గాల రైతులు, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీయేనని ప్రజలు ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర సాధనతోపాటు కేసీఆర్ పాలనలో సాధించిన విజయాలను స్మరించుకుంటూ బీఆర్ఎస్ నిర్వహించనున్న రజతోత్సవ వేడుకలకు తరలిరావాలని శ్రేణులను కోరారు. ఆయన వెంట జిల్లా పార్టీ అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, తాడేపల్లి రవి, మందపాటి రాజమోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్ తదితరులు ఉన్నారు.

# ఊరూవాడా.. ఓరుగల్లు బాట పట్టాలి

రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్



బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్

జూలూరుపాడు, ఏప్రిల్ 16: రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ఊరూ వాడా.. ఓరుగల్లు బాట పట్టాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ సన్నాహక సమావేశం మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ఏండ్లు పోరాటం చేసి రాష్ర్టాన్ని సాధించి.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి దేశంలోనే తెలంగాణ రాష్ర్టాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజలు అడగని పథకాలను కూడా ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేశారని గుర్తు చేశారు. రజతోత్సవ సభకు ప్రతీ పల్లె నుంచి భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఉద్యమకారులు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాలు తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యదళ్లపల్లి వీరభద్రం, దుద్దుకూరి నాగేశ్వరరావు, మూడు చిట్టిబాబు, హరిలాల్, బోజ్యానాయక్, బాలాజీ, రాములు తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

---

ఆరుగాలం శ్రమించిన అన్నదాతలను అకాల వర్షం శోక సంద్రంలోకి నెట్టింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళ వారం అర్ధరాత్రి కురిసిన వర్షం.. కర్షకులకు తీవ్రమైన కష్టనష్టాలను మిగిల్చింది. పంట కాలపు రెక్కల కష్టానికి రెండు మూడు రోజుల్లో ఫలితం వస్తుందనుకుంటున్న సమయంలో అకాల వర్షం వచ్చింది. కోలుకోలేని విధంగా కర్షకులను దెబ్బ తీసింది. వివిధ మండలాల్లోని పలు పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. కల్లాల్లో ఆరబోసి ఉన్న ధాన్యం, మిర్చి, మక్కల రాసులు వరదపాలయ్యాయి. ఈదురుగాలుల కారణంగా పలు కల్లాల్లో ధాన్యంపై కప్పిన పరదాలు చెల్లాచెదురయ్యాయి. దీంతో వర్షపు నీటితో ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. ఇక కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మరికొన్ని చోట్ల పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. ఇంకొన్ని చోట్ల ఏపుగా ఎదిగిన పంటలు కూడా పూర్తిగా నేలమట్టమయ్యాయి. -నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 16

# అర్ధరాత్రి వర్షం.. అన్నదాతకు శోకం






- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ పంటలు వర్షార్పణం
- కల్లాల్లోని ధాన్యం, మిర్చి, మక్కలు వరదనీటి పాలు
- పలు మండలాల్లో వాలిపోయిన వరి, మొక్కజొన్న పంటలు
- ఈదురుగాలులకు కొనుగోలు కేంద్రాల్లో చెల్లాచెదురైన పరదాలు
- కొన్నిచోట్ల నేలకూలిన స్తంభాలు, విరిగిపడిన చెట్లు



దుమ్ముగూడెం: కల్లంలోని ధాన్యం రాసులపై పరదాలు కప్పుతున్న రైతులు. (ఇన్‌సెట్) చర్ల: రాలిన వడ్లు




1. రాలిన మామిడి, 2.కూలిన ట్రాన్స్‌ఫార్మర్





ఖమ్మం రూరల్: తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని టబ్బులో పోస్తున్న రైతు కుమారుడు

మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నదాతలను అతలాకుతలం చేసింది. కాంటాలకు సిద్ధంగా ఉన్న ధాన్యం కొందరిది, కోతలు పూర్తయి ఆరబెట్టిన ధాన్యం మరికొందరిది, బస్తాలకు ఎత్తి కాంటాకు సిద్ధంగా ఉంచిన ధాన్యం ఇంకొందరిది. ఇలా.. సరిగ్గా రెండు మూడు రోజుల్లో తమ కష్టానికి తగిన ప్రతిఫలం చేతికొస్తుందనుకున్న సమయంలో.. ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షం హలధారులనందరినీ నట్టేట ముంచింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో వచ్చిన వర్షం.. ఆ సమయంలో కర్షకుల కంటి మీద కునుకు లేకుండా చేసింది. తెల్లవారితే చాలు.. కాంటాలు కాగానే నగదు చేతికొస్తుందనుకున్న సమయంలో వచ్చిన ఈ అకాల వర్షం.. అన్నదాతల ఆశలను ఆవిరిచేసింది.

కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు సిద్ధంగా ఉన్న ధాన్యంపై అడుగు మేర నీళ్లు చేరడంతో అన్నదాతలు ఆ నీళ్లను బకెట్లతో ఎత్తి బయట పోశారు. అర్ధరాత్రి కావడంతో ఎక్కువమంది రైతులు ఆరబెట్టిన ప్రదేశాలకు చేరుకోలేకపోయారు.

ఖమ్మం రూరల్ మండలంలో కొద్దిరోజుల క్రితమే నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గన్నీబ్యాగుల కొరత, కాంటాల ప్రక్రియ ఆలస్యం కారణంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాసులు పోటెత్తాయి. అర్ధరాత్రి మొదలైన వర్షాన్ని కూడా లెక్కచేయకుండా అనేకమంది రైతులు తమ ఇళ్లకు చాలాదూరం ఉన్న కొనుగోలు కేంద్రాల వద్దకు చీకటిలోనే చేరుకున్నారు. ధాన్యంపై కప్పేందుకు అక్కడ టార్పాలిన్లను కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో నెత్తీనోరూ బాదుకున్నారు. తాము తెచ్చుకున్న కొద్దిపాటి పరదాలను తమ పంటలపై కప్పి వాటిని కాపాడుకునే ప్రయత్నం చేశారు. తిరుమలాయపాలెం, దుమ్ముగూడెం మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వడ్లు రాలిపోయాయి. మధిర, బోనకల్లు, చింతకాని మండలాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న పంటలు కూడా తడిచిపోయాయి. బూర్గంపహాడ్ మండలంలో కొనుగోళ్లు ఆలస్యమవుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రేయింబవళ్లూ కాపలా ఉంటున్నారు. ఇప్పటికే అక్కడ నాలుగైదు సార్లు వర్షానికి ధాన్యం తడిచిపోవడంతో మరోసారి వర్షం వచ్చినా కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అశ్వారావుపేట, దమ్మపేటల్లో గడిచిన పది రోజులుగా రోజు విడిచి రోజు వర్షం కురుస్తూ రైతులకు తీవ్రమైన నష్టాన్ని మిగుల్చుతోంది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి, వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు కూలాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. చెట్లు కూడా విరిగిపడ్డాయి. ఇక చేతికొచ్చిన మొక్కజొన్న పంట నీటిపాలైంది. మామిడి, పొగాకు, మునగ, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పలువురి ఇళ్లు దెబ్బతిన్నాయి. పై కప్పులు ఎగిరిపోయాయి.



ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు



ఖమ్మం రూరల్: గుర్రాలపాడులో..



బూర్గంపహాడ్: కొనుగోలు కేంద్రంలో..



మిర్చిలో నీళ్లు ఎత్తుతున్న మహిళా రైతు



బోనకల్లు: నేలవాలిన మొక్కజొన్న పంట

---

ఖమ్మం జిల్లాలో మండలానికి ఒక్కటి చొప్పున ఎంపిక చేసిన పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు బిల్లులు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. పైలట్ గ్రామాల్లో వెంటనే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ప్రభుత్వం హుకుం జారీ చేయడంతో ఉన్న కొద్దిపాటి ఇండ్లను (రేకుల ఇళ్లు, గుడిసెలు, పెంకుటిళ్లు) కూల్చి కొత్తవి కట్టుకోవడం ప్రారంభించారు. కొందరివి బేస్‌మెంట్ లెవల్, మరికొందరివి రూఫ్ లెవల్ పూర్తయ్యాయి. కానీ ఇంతవరకు ఒక్కరికి కూడా ఒక్క బిల్లు కూడా రాలేదు. నాలుగు విడతల్లో రూ.5 లక్షలు ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మొదటి విడత బిల్లుల కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ నెల 15న హైదరాబాద్‌లో కొద్దిమంది లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి మొదటి విడత కింద రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు. రెండు మూడు రోజుల్లో మిగతా లబ్ధిదారుల ఖాతాల్లో సంబంధిత నిధులు జమ చేయాలని ఆదేశించారు. కానీ అవి ఎప్పుడు తమ ఖాతాల్లో జమ అవుతాయో ఏమోనని లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు.
– ఖమ్మం, ఏప్రిల్ 16



వైరా మండలంలోని పైలట్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

# ఇళ్లు ప్రారంభం బిల్లులు ఆలస్యం

| మండలం | పైలట్ గ్రామం | మంజూరైన ఇళ్లు | బేస్‌మెంట్ లెవల్ |
|---|---|---|---|
| రఘునాథపాలెం | మల్లేపల్లి | 13 | 1 |
| ఖమ్మంరూరల్ | ఆరెంపుల | 97 | 30 |
| కూసుమంచి | ధర్మతండా | 15 | 10 |
| నేలకొండపల్లి | కొంగర | 3 | 1 |
| తిరుమలాయపాలెం | ఏలువారిగూడెం | 14 | 6 |
| బోనకల్లు | గార్లపాడు | 13 | 4 |
| చింతకాని | రేపల్లెవాడ | 26 | 9 |
| మధిర | చిలుకూరు | 37 | 25 |
| ముదిగొండ | ఖానాపురం | 19 | 2 |
| ఎర్రుపాలెం | రాజులదేవరపాడు | 46 | 21 |
| కల్లూరు | లోకవరం(ఈస్ట్) | 53 | 9 |
| పెనుబల్లి | రామచంద్రాపురం | 27 | 5 |
| సత్తుపల్లి | కొత్తూరు | 81 | 26 |
| తల్లాడ | కొడవటిమెట్ట | 13 | 2 |
| వేంసూరు | చినమల్లెల | 78 | 9 |
| ఏన్కూరు | రేపల్లెవాడ | 94 | 15 |
| కొణిజర్ల | చిన్నగోపతి | 49 | 28 |
| సింగరేణి | కొత్తతండా | 13 | 3 |
| వైరా | పుణ్యపురం | 89 | 13 |
| కామేపల్లి | పొన్నెకల్లు | 59 | 17 |
| మొత్తం | | 839 | 236 |

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఒక్క బిల్లూ రాలే..
- మంజూరైనవి 839.. మొదలుపెట్టింది 236
- బేస్‌మెంట్, రూఫ్ లెవల్‌లోనే నిలిచిపోయిన ఇళ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు
- నిధుల విడుదలకు 15న సీఎం, మంత్రి ఆదేశాలు
- లబ్ధిదారుల ఖాతాలకు ఎప్పటికి చేరేనో?

బేస్‌మెంట్ రూఫ్ లెవల్‌లో ఉన్న ఇందిరమ్మ ఇల్లు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని చెబుతున్నది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు కలిసి 17,500 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు పైలట్ గ్రామాల కింద ఎంపిక చేసిన 20 గ్రామాల్లో 839 మందిని మాత్రమే ఎంపిక చేశారు. మొత్తం 17,500 ఇళ్లలో కేవలం 839 మాత్రమే మంజూరు చేయగా.. వాటిలో 236 ఇళ్లు మాత్రమే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. చింతకానిలో రేపల్లెవాడ, ఖమ్మం రూరల్ మండలంలో ఆరెంపుల, కామేపల్లిలో పొన్నెకల్, కొణిజర్లలో చిన్నగోపతి, కల్లూరులో ఈస్ట్ లోకవరం, కూసుమంచిలో ధర్మాతండా, బోనకల్‌లో గార్లపాడు, తిరుమలాయపాలెంలో ఏలువారిగూడెం, నేలకొండపల్లిలో కొంగర, రఘునాథపాలెంలో మల్లెపల్లి, ముదిగొండలో ఖానాపురం, ఎర్రుపాలెంలో రాజులదేవరపాడు, మధిరలో చిల్కూరు, సత్తుపల్లిలో కొత్తూరు, వైరాలో పుణ్యపురం, తల్లాడలో కొడవిమిట్ట, సింగరేణిలో కొత్తతంగా, పెనుబల్లిలో రామచంద్రాపురం, వేంసూరులో చిన్నమల్లెల, ఏన్కూరులో రేపల్లెవాడను ఎంపిక చేశారు. ఈ మొత్తం గ్రామాల్లో కేవలం 850 మందిని మాత్రమే ఎంపిక చేశారు.

## పనులు ప్రారంభించినవి 236 మాత్రమే...

ఖమ్మంజిల్లాలోని 20 మండలాల ఎంపీడీవోలు ఆయా మండలాల్లోని పైలట్ గ్రామాలకు చెందిన మొత్తం 1,380 మంది లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. వీరిలో జిల్లా కలెక్టర్ 965 మందికి అప్రూవల్ ఇవ్వగా.. 839 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో 547 మంది ఇంటి స్థలాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు వారికి ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో జియో ట్యాగ్ చేయగా.. వారిలో కేవలం 236 మంది మాత్రం ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. వీరిలో కొంతమంది బేస్‌మెంట్ లెవల్ నిర్మించుకోగా మరికొందరు రూఫ్‌లెవల్ వరకు కూడా నిర్మాణం చేశారు. వీరందరి నిర్మాణాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వీరికి ఇంతవరకు ప్రభుత్వం నుంచి బిల్లు రాలేదు.

## బిల్లుల కోసం ఎదురుచూపులు

ఇందిరమ్మ లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తున్నది. వీటిని కూడా నాలుగు విడతలుగా అందించేలా నిర్ణయించింది. లబ్ధిదారుడు ఇంటి పనులు ప్రారంభించి బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగానే రూ.లక్ష, రూఫ్ లెవల్‌కు మరో లక్ష, స్లాబ్ పూర్తికాగానే రూ.2 లక్షలు, పనులన్నీ పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష ఇవ్వనున్నారు. అయితే ఇప్పటివరకు ఖమ్మంజిల్లాలో ఏ ఒక్క లబ్ధిదారుడికి కూడా బిల్లు చెల్లించకపోవడం విశేషం.

### వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం..



ఖమ్మం జిల్లా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారికి వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే పనులు మొదలుపెట్టాలి. బిల్లులు వెంటనే వస్తాయి.
– బానోతు శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ, ఖమ్మం జిల్లా

---

# భూభారతిపై అవగాహన అవసరం

- నేటి నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు
- రెవెన్యూ అధికారులతో సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి, కొత్త ఆర్ఓఆర్ చట్టంపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ శాఖ అధికారులతో భూభారతి, కొత్త ఆర్ఓఆర్ చట్టంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి, కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దీనిపై తహసీల్దార్లు అవగాహన పెంచుకోవడంతోపాటు మండల, గ్రామస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. చట్టం అమలుకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద నేలకొండపల్లి మండలాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ నెల 17 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించి దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సదస్సులకు కనీసం 500లకు పైగా జన సమీకరణ చేయాలని, ఫంక్షన్ హాల్, తాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. సందేహాల నమోదుకు రిజిస్టర్ నిర్వహించాలన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలో సమస్యలుంటే మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టం, కొత్త నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన పొందాలన్నారు. 2020లో ఉన్న రికార్డుల తప్పొప్పులను సరిచేయడానికి ఫిర్యాదుదారు ఏడాదిలోపు దరఖాస్తు చేయాలని, ఈ దిశగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు చట్టంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేంద్ర గౌడ్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహశీల్దార్లు, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# 'మూడు నెలల వేతనాన్ని విడుదల చేయాలి'

రఘునాథపాలెం, ఏప్రిల్ 16: మూడు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏ) డిమాండ్ చేశారు. ఈ మేరకు రఘునాథపాలెం మండల ఫీల్డ్ అసిస్టెంట్లందరూ కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఐఎన్‌టీయూసీ పిలుపు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పించినట్లు సంఘం అధ్యక్షుడు బరిగల కోటేశ్వరరావు తెలిపారు. సంఘం నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, సీహెచ్.రాధిక, తూరుగంటి సూర్యం, ప్రసాద్, నాగుల్‌మీరా, ఉపేందర్, శ్రీను, మస్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి పాల్గొన్నారు.



ఎంపీడీవో ఆఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

